

గంజాయి ముఠా అరెస్ట్

గంజాయి ముఠా సభ్యులను చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. - 8లో



చేనేత ఉత్పత్తులు ప్రోత్సహించాలి

చేనేత ఉత్పత్తులు ప్రోత్సహించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వెంకటేశం అన్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 32°/ 26°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యాదాద్రిలో నిత్యపూజలు



జోడు సేవలు ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో బుధవారం నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాతం, అర్చన, అభిషేకం వంటి సంప్రదాయ పూజలు జరిపించారు. అనంతరం ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ వంటి పూజలు నిర్వహించారు. రాత్రికి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి, ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

అన్ని గ్యారంటీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

చౌటుప్పల్: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన అన్ని గ్యారంటీలను అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని రంగారెడ్డి స్మారక భవనంలో నిర్వహించిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారం చేపట్టి ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు సంక్షేమ పథకాల ఊసే లేదని ఆరోపించారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, అన్ని రకాల పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2,500, ఇళ్ల నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. అవ్వారు రామేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ, ప్రతినిధులు దోనూరి నిర్మల, నాగమణి, జయమ్మ, అండాలు, లక్ష్మి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

భువనగిరిటౌన్: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ డిమాండ్ చేశారు. బుధవారం గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారందరికీ వేతనాలు పెంచాలని కార్మిక బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మధు, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం ఈశ్వర్, అధ్యక్షుడు బందెల భిక్షం, మంద యాదగిరి, రమేష్, బాల మల్లయ్య, పరమేశ్, ఎల్లమయ్య, యాదగిరి, స్వామి పాల్గొన్నారు.

చేనేతలకు పని కల్పించాలి

చౌటుప్పల్: చేనేతలకు పని కల్పించాలని చౌటుప్పల్‌కు చెందిన చేనేత, అనుబంధ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈమేరకు వారు బుధవారం చేనేత, హస్తకళల ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్‌ను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వారిలో కర్నాటి జనార్దన్, సుంకి రవికుమార్, రాపోలు సత్యనారాయణ, గంజి శ్రీనివాస్ తదితరులున్నారు.

ప్రభుత్వ భూమి సాగు చేయొద్దని హెచ్చరిక బోర్డు

మోత్కూరు: మోత్కూరులోని బిక్కేరు వాగు సమీపంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి సాగు చేయొద్దని హెచ్చరిస్తూ బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుమన్, సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. బిక్కేరు వాగు వెంట ఉన్న 9 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎవరూ సాగు చేయొద్దని, క్రయ విక్రయాలు చేయొద్దని బోర్డులో పేర్కొన్నారు.

ఖాకీ వనంలో కలుపు మొక్కలు!



ఉమ్మడి జిల్లాలో పలువురు ఎస్‌ఐలపై ఆరోపణలు

- మహిళల పట్ల అనుచిత ప్రవర్తన
- సివిల్ వివాదాల్లో జోక్యం.. సెటిల్‌మెంట్లు
- అవినీతి, అక్రమ దందాలు
- పోలీస్‌శాఖకు మచ్చతెస్తున్న కొందరి తీరు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'నాతో మంచిగా ఉండూ.. నీ అవసరాలు తీరుస్తా...' అంటూ శాలిగౌరారం ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ అనుచితంగా ప్రవర్తించారని ఎస్పీ, డీజీపీలకు ఓ మహిళ ఫిర్యాదు చేయడం జిల్లాలో సంచలనంగా మారింది. కొందరు ఖాకీలు బాధితుల అవసరాలను ఆసరాగా చేసుకుని పోలీస్ స్టేషన్లలోనే పంచాయితీలు, సెటిల్‌మెంట్లు చేస్తూ దండుకుంటుండగా.. మరికొందరు సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. అదీ చాలదన్నట్లు ఇంకొందరు మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ పోలీసు శాఖకే మచ్చ తెస్తున్నారు. వివిధ సందర్భాల్లో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సస్పెండ్ చేయడం, ఎస్పీ కార్యాలయాలకు అటాచ్ చేయడం వంటి చర్యలు చేపడుతున్నా అలాంటి వారిలో మార్పు రావడం లేదు. పైగా రాజకీయ పలుకుబడితో కొద్దిరోజుల్లోనే తిరిగి పోస్టింగ్ పొందుతున్నారు.

అవసరాలను ఆసరాగా చేసుకొని..

బాధితుల అవసరాలే ఆసరాగా కొంతమంది ఎస్‌ఐలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ నేతల అండదండలతో అవినీతి దందా కొనసాగిస్తున్నారు. ఏదైనా కేసు విషయంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే చాలు న్యాయఅన్యాయాలు పట్టించుకోకుండా, ముడుపులు ముట్టజెప్పిన వారికి వంతపాడుతూ బాధితులను వేధింపులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన ఓ ఎస్‌ఐపైనా లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ డీఎస్పీకి ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. అయితే ఆ తరువాత అతన్ని పోలీసు తరహాలో మేనేజ్ చేసి ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకునేలా చేశారు.

ఎస్‌ఐ తీరుతో గుండెపోటు, వ్యక్తి మృతి

చింతపల్లి మండలంలో గతంలో పనిచేసిన ఓ ఎస్‌ఐ భూవివాదంలో జోక్యం చేసుకున్నారు. ఆ కేసులో ఓ వృద్ధుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కొట్టడం వల్లే అతను చనిపోయాడని ఆ వృద్ధుడి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే పోలీసులు ప్రశ్నిస్తున్న సమయంలో వృద్ధుడికి గుండెపోటు వచ్చిందని, పోలీసులు కొట్టినందున ఆయన చనిపోలేదని, గుండె పోటు కారణంగానే అతను చనిపోయాడని తేల్చారు. కాగా, సదరు ఎస్‌ఐని పోలీస్ శాఖ సస్పెండ్ చేసింది. కొద్దినెలలకే రాజకీయ పలుకుబడితో ఆయన పోస్టింగ్ తెచ్చుకోగలిగారు.

ప్రతీ చిన్న పనికి ముడుపులే..

నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో చాలా కాలంగా పని చేస్తున్న ఓ ఎస్‌ఐ సివిల్ కేసులో జోక్యం చేసుకొని ముడుపులు పుచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాదు మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యక్తి దగ్గర నుంచి సదరు ఎస్‌ఐ మరో రూ.20 వేలు తీసుకున్నట్లు తెలిసింది. దీంతో మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యక్తి తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితురాలు సీఐకి విషయాన్ని తెలియజేసింది. దీంతో సీఐ సదరు ఎస్‌ఐకి వార్నింగ్ ఇచ్చినట్లు చర్చ జరుగుతోంది. అంతేకాదు వృద్ధ దంపతులు తమ కుమారుడిని ఎర్రగడ్డ ఆసుపత్రికి పంపించేందుకు కేసు నమోదు చేయాలని సదరు ఎస్‌ఐని కోరగా వారి నుంచి కూడా ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఆ ఎస్‌ఐ ప్రతి చిన్నపనికి ముడుపులు పుచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది.

వివాదం నుంచి బయట పడేందుకు రాజకీయ ఒత్తిళ్లు!

మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వివాదం నుంచి బయటపడేందుకు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగా స్థానిక నేతలు కొందరు బాధితురాలి కుటుంబంపై తీవ్ర ఒత్తిడిని తీసుకొస్తున్నట్లు సమాచారం. ఓ నాయకుడు మరో అడుగు ముందుకేసి నకిరేకల్‌లో నివాసం ఉంటున్న ఎస్‌ఐ ఇంటికి మిమ్మలను తీసుకుపోతానని, మీరు రాజీ పడాలని సూచించినట్టు తెలిసింది. మేము చెప్పినట్లు వింటే మీకు అన్ని విధాలుగా సహకారం ఉంటుందని, లేకపోతే సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా ఆ నాయకుడు హెచ్చరించినట్లు సమాచారం. ఆ నేతలే పోలీస్‌స్టేషన్‌కు వచ్చే కేసుల్లో ఎస్‌ఐకి మధ్యవర్తులుగా వ్యవహరించి సెటిల్‌మెంట్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు బాధితురాలు ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడి సహకారంతో ఎస్పీకి ఫిర్యాదు చేయడాన్ని మరో రాజకీయ పార్టీ నేతలు జీర్ణించుకోలేక ఎస్‌ఐ తరఫున వకాల్తా పుచ్చుకున్నట్లు తెలిసింది. అందులో ఇద్దరు ముఖ్య నేతలు కూడా ఉన్నట్లు సమాచారం. దీంతో బాధిత కుటుంబం తమకు న్యాయం జరుగుతుందో లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్పీ విచారణ అధికారిగా నియమించిన సదరు అధికారిపై తమకు నమ్మకం లేదని, ఆయనను మార్చాలని సదరు బాధితురాలు డీజీపీకి ఫిర్యాదు చేశారు.

- నల్లగొండ జిల్లా డిండి మండలంలో ఓ ఎస్‌ఐ ఎర్రగుంటపల్లిలో భూ వివాదంలో జోక్యం చేసుకొని ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మరో వర్గం వారు డీఎస్పీకి ఫిర్యాదుచేశారు.
- గుండాల మండలంలో ఓ ఎస్‌ఐ ఇసుక దందాకు పూర్తిస్థాయిలో సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఎదురు తిరిగితే బెదిరింపులు, అక్రమ కేసులు

యాదాద్రి జిల్లా మోత్కూర్ మండలంలో పని చేసిన ఓ ఎస్‌ఐ భూవివాదాల్లో మితిమీరిన జోక్యం చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తనకు ఎదురుతిరిగిన వారిపై చేయి చేసుకోవడం, బెదిరింపులకు పాల్పడడం, అక్రమ కేసులను పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని ముసిపట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌లో బంధించి చితకబాదినట్లు తెలిసింది. అంతేకాదు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారిపైనా చేయి చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఎస్పీ కార్యాలయానికి అటాచ్

సూర్యాపేట జిల్లా నాగారం మండలంలో పనిచేసిన ఓ ఎస్‌ఐ గతంలో భూవివాదంలో జోక్యం చేసుకున్నారు. అందులో ఫిర్యాదుదారుడి వైపు కాకుండా ఎదుటి వ్యక్తికి అనుకూలంగా వ్యవహరించారు. ఎదుటి వ్యక్తికి 20 గుంటల భూమి ఇవ్వాలని చెప్పారు. ఆ మాట వినకపోవడంతో ఎస్‌ఐ విచక్షణ కోల్పోయి ఓర్సు అశోక్‌ను చితకబాదారు. దీనిపై వారు ఎస్పీ, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

- తిరుమలగిరి మండలంలోనూ గతంలో పనిచేసిన మరో ఎస్‌ఐ సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపణలు రావడంతో ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట



జూలూరులో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

- జెడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ జిల్లాలో 20 ఆరోగ్య ఉపకేంద్రాల భవనాలతో పాటు రెండు పీహెచ్‌సీలకు నిధులు మంజూరు చేసినట్లు జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి తెలిపారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.25లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు, జూలూరులోని జెడ్పీ హైస్కూల్‌లో రూ.12.50లక్షలలో నిర్మించిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా రూ.20లక్షలతో చేపట్టిన ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జూలూరు-రుద్రవెల్లి బ్రిడ్జి నిర్మాణం పనులు మొదలయ్యాయని, పెండింగ్‌లో ఉన్న దేశ్‌ముఖి, పిలాయిపల్లి, జూలూరు రోడ్డు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పాపారావు, ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కోట పుష్పలత మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్, ఎంపీటీసీ శంకరమ్మ కిష్టయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, పీఆర్ ఏఈ వెంకటేశం, మండల వైద్యాధికారిణి శ్రీవాణి, భవానీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్‌రెడ్డి, సామ మోహన్‌రెడ్డి, కాసుల అంజయ్య పాల్గొన్నారు.

వలిగొండలో ఆరోగ్య కేంద్ర భవనం..

వలిగొండ: వలిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నిర్మించిన నూతన భవనాన్ని, ప్రొద్దటూరులో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనాలను జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నూతి రమేష్, వాకిటి పద్మాఅనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమాబాల్‌నర్సింహ, మాజీ సర్పంచులు, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్, డాక్టర్ సుమన్ కళ్యాణ్, వైద్యులు యశోద, జ్యోతి, స్వర్ణలత, స్వామీ, ఏపీఎం ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ గుబులు

- చిన్నకొండూర్ మార్గంలో గతంలో పలు కారణాలతో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ
- తాజాగా రెండు లేన్ల రోడ్డుకు మరోసారి హద్దులు వేసిన అధికారులు



చౌటుప్పల్‌లో సమావేశమైన రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోతున్న యజమానులు

చౌటుప్పల్: చౌటుప్పల్‌లోని హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి నుంచి వలిగొండ మండలం సంగెం మార్గంలో 13.2కిలోమీటర్ల రోడ్డును రెండు వరుసలుగా విస్తరించే పనులు గతంలో చేపట్టారు. ఇప్పటికే సంగెం, చిన్నకొండూర్, పెద్దకొండూర్, చౌటుప్పల్ గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, పలు ప్రాంతాల్లో కల్వర్టులు నిర్మించారు. అయితే డబుల్ రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణ కేంద్రంలో చిన్నకొండూర్ రోడ్డును రెండు వరుసలుగా విస్తరించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో చిన్నకొండూర్ రోడ్డును ప్రస్తుతం ఉన్న మాదిరిగా ఎక్కడా భవనాలు తొలగించకుండా యాథావిధిగా ఉంచాలని నిర్ణయించారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో నిర్ణయాలు కూడా మారాయి. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, ఇతర భవన నిర్మాణాల యజమానుల్లో గుబులు మొదలైంది.

ఇప్పటికే హద్దులు వేసిన అధికారులు

పట్టణ కేంద్రంలోని చిన్నకొండూర్ మార్గంలో హైవే నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు 1.5కిలోమీటర్ల రోడ్డును రెండు వరుసలుగా విస్తరించేందుకు అప్పట్లోనే చర్యలు చేపట్టారు. ఇందుకుగాను సుమారు 19నెలల క్రితమే పూర్తిస్థాయిలో కొలతలు వేసి ప్రసుత్తం ఉన్న రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 33ఫీట్లుగా నిర్ణయించి హద్దులు వేశారు. అప్పట్లో పలు రకాల కారణాలతో విస్తరణ ఆగిపోయింది. తాజాగా ఈ నెల 24న మరోసారి కొలతలు వేసి హద్దులు వేశారు.

జీవనోపాధి దెబ్బతీయొద్దు



రెండు వరుసల రోడ్డు విస్తరణ అంతగా అవసరమేమీ లేదు. ఇప్పుడు ఉన్న రోడ్డు, ఇరువైపులా ఉన్న ఖాళీస్థలాన్ని పూర్తిస్థాయిలో వినియోగిస్తే సరిపోతుంది. బలవంతంగా కూల్చివేతలకు పాల్పడి మా జీవనోపాధి దెబ్బతీయొద్దు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా కూల్చివేస్తామని ప్రకటించడం సరికాదు.

– జక్కిడి సంతోష్‌రెడ్డి, ఇంటి యజమాని

తొలగింపునకు వారం గడువు

వారం రోజులు గడువు ఇస్తున్నామని, ఆలోపు తాము నిర్ణయించిన హద్దుల వరకు నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని యజమానులకు అధికారులు సూచించారు. ఇరువైపులా 33ఫీట్ల చొప్పున తొలగింపు చేపడితే చాలా మేరకు భవన నిర్మాణాలు కనుమరుగవుతాయని బాధితులు ఆందోళన చెందుతున్నారు.

సమావేశమైన బాధితులు

చిన్నకొండూర్‌రోడ్డు రెండు వరుసలుగా విస్తరించాలన్న ప్రతిపాదన నేపథ్యంలో సంబంధిత బాధితులు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అభిప్రాయాలు సేకరించారు. సమస్యను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, మున్సి పల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. వరగంటి రాజేందర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్ పోలోజు శ్రీధర్‌బాబు, దండ అరుణ్‌కుమార్, బొబ్బిళ్ల శ్రీరాములు, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, ఖయ్యూం, నర్సింహ ఉన్నారు.

స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దు



భువనగిరి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

భువనగిరిటౌన్: యువత తమ స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దని, ఎలాంటి చెడు అలవాట్లకు లోను కావద్దని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం – అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని భువనగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువతను చక్కదిద్దే బాధ్యత అందరిపై ఉందన్నారు. కలెక్టర్ హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ.. డ్రగ్స్‌పై ఎవరైనా సమాచారం ఇవ్వాలంటే టోల్ ఫ్రీ నంబర్ 14416కు కాల్ చేయాలని తెలిపారు. అనంతరం మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, కుటుంబ విచ్ఛిన్నంపై న్యాయ సేవా సంస్థ రూపొందించిన షార్ట్ ఫిల్మ్ ప్రదర్శించారు. అంతకుముందు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీలు బీరు మల్లయ్య, అనురాధ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రీతి స్వరూప్, జిల్లా న్యాయ సహాయ, సలహా మండలి చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జయపాల్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, అధికారులు

పాల పైసలు వస్తలేవు



ఈ ఫొటోలోని రైతు రాజాపేట మండల కేంద్రానికి చెందిన రేగు నర్సింహులు. ఇతనికి పాడి పరిశ్రమే జీవనాధారం. పది పాడి పశువుల ద్వారా వచ్చే 30 లీటర్ల పాలను పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో రోజూ పోస్తాడు. గత మూడు నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాడు. పాల బిల్లులు వస్తేనే తన పశువులకు దాణా, మేత తదితరాల కొనుగోలుకు వాడుకుంటాడు. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో అప్పు చేయాల్సి వస్తుందని వాపోతున్నాడు.



ఈయన మోటకొండూర్‌కు చెందిన నోముల నర్సిరెడ్డి. 11 ఆవులు, ఒక గేదె ద్వారా ప్రతిరోజు 90 నుంచి 100 లీటర్ల పాలను ఉత్పత్తి చేస్తుంటాడు. మేడికుంటపల్లి పాల సొసైటీలో రోజూ పాలు పోస్తున్నాడు. గత రెండు నెలలుగా పాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి 15 రోజులకు ఒక బిల్లు చెల్లించాల్సి ఉండగా మూడు బిల్లులగాను ఒక బిల్లు మాత్రమే ఇచ్చారు. ఇంకా 39 రోజులకు సంబంధించి రెండున్నర బిల్లులను పెండింగ్‌లో ఉంచారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు.

- రెండు, మూడు నెలలుగా అందని మదర్ డెయిరీ బిల్లులు
- ఉన్నత స్థాయి ఉద్యోగులకు సైతం జీతాల చెల్లింపులో జాప్యం
- సొసైటీల్లోని రైతుల డిపాజిట్లను బిల్లుగా చెల్లిస్తున్న అధికారులు

సాక్షి,యాదాద్రి: మదర్ డెయిరీ నుంచి రెండు, మూడు నెలలుగా పాల బిల్లులు అందడం లేదు. దీంతో పాల ఉత్పత్తిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 30వేల మంది రైతులు ప్రతిరోజు 1.10 లక్షల లీటర్ల పాలను గ్రామాల్లోని సొసైటీల ద్వారా మదర్ డెయిరీకి పోస్తున్నారు. ఈమేరకు పక్షం రోజులకు ఒకసారి రూ.4.25 కోట్ల బిల్లులు చెల్లిస్తారు. కొన్నిసార్లు హెచ్చుతగ్గులు ఉంటాయి. ఈలెక్కన సుమారు రూ.12కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే బిల్లుల చెల్లింపు ఆలస్యం కావడంతో సొసైటీల్లో ఉన్న రైతుల డిపాజిట్లలో నుంచి పలువురు రైతులకు బిల్లులుగా చెల్లిస్తున్నారు. అయితే కొంతకాలంగా మదర్ డెయిరీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. పాడి రైతుల బిల్లులతోపాటు మదర్ డెయిరీలో పనిచేసే ఉన్నత స్థాయి ఉద్యోగులకు సైతం జీతాలు చెల్లింపు జాప్యం అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ డెయిరీలతో ఎదురవుతున్న పోటీతోపాటు, పాలకవర్గంలో కోర్టు వివాదాలతో ఆర్థిక ఇబ్బందులు వస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

నిలదీస్తున్న రైతులు..

ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మదర్ డెయిరీ విస్తరించి ఉంది. ప్రతి సంవత్సరం జూన్ నెలాఖరు వరకు గ్రామాల్లో పాల సంఘాల ఎన్నికలు జరుగుతాయి. గ్రామాల్లో సొసైటీలకు పాలు పోసే రైతులు పాల్గొనే ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా జరుగుతాయి. అయితే ఈ ఎన్నిక సందర్భంగా పెండింగ్ పాల బిల్లుల సమస్యను రైతులు లేవనెత్తుతున్నారు. ప్రస్తుతం ఉన్న చైర్మన్, కమిటీ సభ్యులను నిలదీస్తున్నారు.



వలిగొండ మండలం పులిగిల్లలో కేంద్రం వద్ద పాలు పోస్తున్న రైతులు

రూ.9వేల బిల్లు రావాలి



ప్రతిరోజు ఆరు లీటర్ల పాలు కేంద్రానికి పోస్తాను. బిల్లులు రాక రెండు నెలలు కావస్తుంది. ఇప్పటివరకు బకాయి రూ 9.వేలు రావాలి. గతంలో 15 రోజులకోసారి ఇచ్చే బిల్లు ఇప్పుడు సరిగ్గా ఇవ్వడం లేదు. పశువుల దాణాకు నెలకు రూ.1500 ఖర్చవుతుంది. బిల్లు పెండింగ్‌లో పెట్టడంతో ఇబ్బంది అవుతోంది. గతంలో మాదిరిగా బిల్లులు చెల్లించాలి.

– మంచాల జంగయ్య, రైతు, జనగామ

డిపాజిట్ డబ్బులు బిల్లులుగా చెల్లిస్తున్నారు



మదర్ డెయిరీలో పాలు పోస్తున్నా. ప్రతి బిల్లులో రూ.6వేల వరకు వస్తాయి. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో మా పాల సొసైటీకి చెందిన డిపాజిట్ రూ. 80 వేలు ఉన్నాయి. డిపాజిట్ నుంచే పాల బిల్లు మదర్ డెయిరీ బిల్లుగా రైతులకు చెల్లిస్తున్నారు. దీని వల్ల బోనస్ నష్టపోయే ప్రమాదం ఉంది. మదర్ డెయిరీ బిల్లులు వెంటనే చెల్లించాలి.

– కొంతం లింగారెడ్డి, పాడిరైతు, ఆరెగూడెం

తొందరగా చెల్లించాలి

మదర్ డెయిరీలో రోజుకు రెండున్నర లీటర్ల పాలు పోస్తున్నా. నెలకు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు బిల్లు వచ్చేది. మూడు నెలలుగా బిల్లు రావడం లేదు. ఈ డబ్బులతో మాకు కుటుంబ ఖర్చులు తీరిపోయేవి. ప్రస్తుతం బిల్లులు రాకపోవడంతో ఇబ్బందిగా మారింది.

– జినుకల మహేష్, పాడి రైతు, ఆరూర్

చెల్లింపులో జాప్యం వాస్తవమే

పాడి రైతులకు బిల్లుల చెల్లింపులో జాప్యం వాస్తవమే. పెండింగ్‌లో ఉన్న పక్షం రోజులకు సంబంధించిన ఒక బిల్లు చెల్లింపు చేశాం. ఉన్నత స్థాయి ఉద్యోగుల జీతాల చెల్లింపు కూడా ఈనెల ఆలస్యమైంది. ప్రైవేట్ డెయిరీల పోటీ తీవ్రంగా ఉంది. పెండింగ్ బిల్లులు త్వరలో చెల్లింపు చేస్తాం.

– కృష్ణ, మదర్ డెయిరీ జీఎం

గంజాయి రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్

- పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీల్లో పట్టుబడిన నిందితులు
- రెండు కార్లు, 280 కిలోల గంజాయి స్వాధీనం
- ముగ్గురిని కోర్టులో రిమాండ్ చేసిన పోలీసులు


ఇన్నోవా కారు వెనుక భాగంలో దొరికిన గంజాయి ప్యాకెట్లు

చౌటుప్పల్: తక్కువ సమయంలోనే ఎక్కువ మొత్తంలో ఆదాయం పొందాలని భావించిన ముగ్గురు స్నేహితులు గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. చౌటుప్పల్ సీఐ అశోక్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా మంగల్‌వేద తాలూకా బ్రహ్మపురి గ్రామానికి చెందిన బోస్లా అబా(29), దక్షిణ సోలాపూర్ తాలూకా బక్షిహిప్పరంగ గ్రామానికి చెందిన అవినాష్ శివాజీ రాథోడ్(19), సోలాపూర్ పాషానగర్‌లోని మోనాశ్వరిశాల గ్రామానికి చెందిన సిద్దరామేశ్వర పూజారి(27) డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. స్నేహితులైన వీరు తమకు వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. విషయాన్ని తమ స్నేహితుడైన మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన అజయ్ రాథోడ్‌కు చెప్పారు. తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తే పెద్దఎత్తున డబ్బు వస్తుందని అజయ్ రాథోడ్ వీరికి చెప్పాడు. తాను ఇదే పనిచేసి బాగా సంపాదిస్తున్నానని తెలిపాడు. దీంతో ముగ్గురు కలిసి గంజాయి రవాణా చేసేందుకు అంగీకరించారు.

ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయి కొనుగోలు చేసి..

ముగ్గురు యువకులు గంజాయి రవాణా చేసేందుకు ముందుకు రావడంతో అజయ్ రాథోడ్ తనకు గంజాయి ఇప్పించే ఒరిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా అలిమెలె తాలూకా ఆలూరికోట గ్రామానికి చెందిన తేజ అనే వ్యక్తిని సంప్రదించాడు. తనకు సరుకు కావాలని చెప్పాడు. దీనికి తేజ అంగీకరించాడు. ఈ క్రమంలో ఈ నెల 23న బోస్లా అబా, అవినాష్ శివాజీ రాథోడ్, సిద్దరామేశ్వర పూజారి కలిసి అజయ్ రాథోడ్ సూచనల ప్రకారం రెండు కార్లలో సోలాపూర్ నుంచి హైదరాబాద్-ఖమ్మం మీదుగా ఆలూరికోటకు వెళ్లారు. అప్పటికే సమాచారం ఇవ్వడంతో అక్కడ గంజాయి సరఫరాదారుడైన తేజ వీరికి 280కిలోల ఎండు గంజాయిని అప్పగించాడు. దానిని ప్యాకెట్లుగా మార్చుకొని రెండు కార్లలో విజయవాడ-హైదరాబాద్ మీదుగా సోలాపూర్ బయల్దేరారు.

వాహనాల తనిఖీల్లో చిక్కిన ముఠా

చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, చౌటుప్పల్ సివిల్ పోలీసులు ఈ నెల 25న మధ్యాహ్నం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో స్విఫ్ట్ డిజైర్, ఇన్నోవా కార్లు అనుమానాస్పదంగా కనిపించాయి. వెంటనే వాటిని ఆపి సోదాలు చేయగా వాటిల్లో గంజాయి ప్యాకెట్లు దర్శనమిచ్చాయి. అందులో ప్రయాణిస్తున్న బోస్లా అబా, అవినాష్ శివాజీ రాథోడ్, సిద్దరామేశ్వర పూజారిని అదుపులోకి తీసుకొని విచారించగా మొత్తం వివరాలు వెల్లడించారు. రెండు కార్లతో పాటు 280కిలోల గంజాయి ప్యాకెట్లు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.80.30లక్షలు ఉంటుందని పోలీసులు నిర్ధారించారు. ముగ్గురు నిందితులను రిమాండ్ నిమిత్తం చౌటుప్పల్ కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి ఆదేశాలతో నల్లగొండ జైలుకు తరలించారు. రాచకొండ సీపీ తరుణ్‌జోషి పర్యవేక్షణలో ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్‌ను పోలీసులు విజయవంతంగా నిర్వహించారు.

మిర్యాలగూడలో 2.750 కిలోలు..


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని అగ్రిగోల్డ్ వెంచర్‌లో గంజాయి విక్రయిస్తున్న వారిని బుధవారం వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల మున్సిపాలిటీకి చెందిన బత్తుల వెంకటేష్ గంజాయిని ప్యాకెట్ల రూపంలో తీసుకొచ్చి మిర్యాలగూడ పట్టణంలోని వినోభానగర్‌కు చెందిన గుంజ శ్రీకాంత్, గాంధీనగర్‌కు చెందిన ఎడవెల్లి ఘని, వేముల సాయిబాబా అలియాస్ సాయి, సుందర్‌నగర్‌కు చెందిన జాదవ్ మహేష్ అలియాస్ మింటు జాని, ముత్తిరెడ్డికుంటకు చెందిన పురం సందీప్, రమావత్ సునీల్‌కు విక్రయించేవాడు. వారు మిర్యాలగూడ పట్టణంలోని అగ్రిగోల్డ్ వెంచర్‌లో స్థానిక యువకులకు గంజాయిని విక్రయిస్తుండగా.. వన్ టౌన్ సీఐకి అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 2.750 కిలోల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.3వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ జి. సుధాకర్, ఎస్‌ఐ రవికుమార్, కానిస్టేబుళ్లు ఎన్. శ్రీను, పి. నాగరాజు, ఎం. సైదులు, తమీజుద్దీన్, వీరబాబు, వెంకటేశ్వర్లు, సీతారాములును డీఎస్పీ అభినందించారు.

సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి


ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీవైఎల్ నాయకులు

భానుపురి (సూర్యాపేట): నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరు సాగర్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ-పీవైఎల్ ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాని రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఇందూరు సాగర్ మాట్లాడుతూ.. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీపై ప్రధాని స్పందించకపోవడం దారుణమన్నారు. ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన అభ్యర్థులకు ఒకేవిధంగా మార్కులు రావడమే దీనికి సాక్ష్యమన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నల్గొండ నాగయ్య, ధరావత్ రవి, పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, వీరబోయిన లింగయ్య, సురేష్, రవి, మధు, కిరణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి

- రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, చేనేత, జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం


చేనేత వస్త్రాల పరిరక్షణ చట్టం కాపీని చూపిస్తున్న వెంకటేశం

భూదాన్‌పోచంపల్లి: నిజమైన చేనేత ఉత్పత్తులు, వాటి స్వచ్ఛతను ప్రోత్సహించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, చేనేత, జౌళిశాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం. వెంకటేశం అన్నారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని చేనేత టై అండ్ డై అసోసియేషన్ రజతోత్సవ భవనంలో చేనేత కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యాండ్లూమ్ మార్కు, సిల్క్ మార్కు, చేనేత వస్త్రాల భౌగోళిక గుర్తింపుపై చేనేత వస్త్ర వ్యాపారులు, చేనేత కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ వస్త్రాలను విక్రయించడం వల్ల భవిష్యత్తులో భౌగోళిక గుర్తింపు కలిగిన(పేటెంట్ హక్కు) పోచంపల్లి ఇక్కత్, గద్వాల సిల్క్ చీరలు, గొల్లభామ చీరలు, తేలియా రుమాల్, వరంగల్ తివాచీలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. నకిలీ వస్తువులను విక్రయించడం, వాటిని ప్రోత్సహించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. మర మగ్గాలపై ఎక్స్‌ట్రా వార్పు, వెఫ్ట్‌తో వస్త్రాలను తయారు చేయవద్దని, కానీ సింగిల్ ఇక్కత్ వస్త్రాలను తయారుచేసి విక్రయించుకోవచ్చన్నారు. ఒరిజినల్ చేనేత వస్త్రాలు తయారు చేసేవారికి ఎల్లప్పుడూ ప్రభుత్వ మద్దతు ఉంటుందన్నారు. చేనేత ఉత్పత్తులకు సిల్క్‌మార్కు, హ్యాండ్లూమ్ మార్కు లోగో తప్పనిసరి అని, తద్వారా తమ వస్త్రాలను డిమాండ్‌గా అమ్ముకోవచ్చన్నారు. పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను ప్రింటింగ్ చేసి విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె. జయరావు, ఏడీఓ ఎండీ షకీల్, జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, టైఅండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, గౌరవ అధ్యక్షుడు కర్నాటి బాలరాజు, కార్యదర్శి ముస్కూరి నర్సింహ, ఉపాధ్యక్షులు ఈపూరి ముత్యాలు, మంగళపల్లి రమేశ్, వనం దశరథ, సీత భవాని, శంకరయ్య, సీత కృష్ణ, నామాల శ్రీనివాస్, రచ్చ భాస్కర్, గంజి యుగేందర్, వేముల నరేశ్, రవీందర్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

చివ్వెంల(సూర్యాపేట): హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ సూర్యాపేట జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన ఉప్పుల విష్ణు, అతడి సోదరుడు ఉప్పుల లింగయ్య తమ పొలాలకు ఎస్సారెస్పీ కాలువ నీరు పెట్టుకునేందుకు గతేడాది జనవరి 16వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో వెళ్లారు. కాలువ నీరు వారు పొలానికి మలుపుతుండగా అదే గ్రామానికి చెందిన ఉప్పుల సతీష్ తన పొలం నుంచి వస్తున్న ఎస్సారెస్పీ నీరు మలుపవద్దంటూ అడ్డుకట్ట వేశాడు. దీంతో లింగయ్య, సతీష్ మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో లింగయ్య అడ్డుకట్ట తొలగిస్తుండగా సతీష్ తన వెంట తీసుకొచ్చిన గొడ్డలితో లింగయ్య మెడ, ఛాతి, భుజంపై విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో లింగయ్య ఒక్కసారిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న లింగయ్య సోదరుడు విష్ణు అన్న వద్దకు వచ్చేసరికి సతీష్ అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే విష్ణు అక్కడే ఉన్న పక్క పొలం రైతుల సహకారంతో లింగయ్యను 108 వాహనంలో సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలుపడంతో హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు విష్ణు ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ సోమ్‌నారాయణ్ సింగ్ ఆదేశాలతో ఎస్‌ఐ సాయిరాం నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్‌కుమార్ వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జరిమాన చెల్లించని పక్షంలో మరో 3 నెలలు జైలు శిక్ష అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ శోభన్‌బాబు సహకరించారు.

ఇరువర్గాల ఘర్షణ.. 12 మందిపై కేసు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలం శోభనాద్రిగూడెంలో బుధవారం రెండు వర్గాలు ఘర్షణ పడగా.. 12మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చింతలపాలెం ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శోభనాద్రిగూడేనికి చెందిన దేశినేని రామారావు బుధవారం పీక్లనాయక్ తండాకు చెందిన లకావత్ సైదులుకు చెందిన మట్టిని తరలిస్తున్న టిప్పర్లను ఆపాడు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే రామారావు, సైదులు తరఫువారు రెండు వర్గాలుగా ఏర్పడి శోభనాద్రిగూడెం చెరువు నుంచి మట్టి తోలుకునే విషయంలో గొడవపడి ఒకరిపై ఒకరు రాళ్లు వేసుకున్నారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 12 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.